ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

- రూట్, సెక్టార్ అధికారుల నియామకాలను పూర్తి చేయాలి
- ఎన్నికల ఖర్చు నియంత్రణపై పర్యవేక్షణ పటిష్ఠంగా ఉంచాలి
- నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్, ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 27: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. రూట్, సెక్టార్ అధికారుల నియామకాలను పూర్తి చేయాలని ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై ఐడీవోసీలో నోడల్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు చాలా కీలకమైనవని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకూ తావు ఇవ్వకూడదని సూచించారు. అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలన్నారు. పోలీసులకు కూడా ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వాలన్నారు. కేంద్రీకృత రిసిప్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల లోపల, బయట సీసీ కెమెరాలు ఉండాలన్నారు. ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది రవాణాకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చి వాటిని ట్రాక్ చేయాలన్నారు. గత ఎన్నికల్లో ఓటర్ టర్నోవర్ తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో సర్వే చేపట్టి పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ఎన్నికల ఖర్చు నియంత్రణపై పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా కంట్రోల్ రూమ్‌ను 24x7 నిర్వహించాలన్నారు. ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్‌సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీ పూర్తి

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం జిల్లాకు కేటాయించిన అదనపు ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీని పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీ ప్యాట్ల గోడౌన్‌లో మంగళవారం చేపట్టిన ఫస్ట్ లెవల్ తనిఖీని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5 నుంచి 14 వరకు 1,920 కంట్రోల్ యూనిట్లు, 3,994 బ్యాలెట్ యూనిట్లు, 2,263 వీవీ ప్యాట్లను, ఈ నెల 26, 27 తేదీల్లో అదనంగా కేటాయించిన 60 కంట్రోల్ యూనిట్లను ఫస్ట్ లెవల్ తనిఖీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, సిబ్బంది హుస్సేన్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చే నెల 5 వరకే చెరకు క్రషింగ్

కూసుమంచి(నేలకొండపల్లి), ఫిబ్రవరి 27 : నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్, పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో 2023-2024 సంత్సరానికి గాను చెరకు క్రషింగ్ వచ్చే నెల 5వ తేదీ వరకు మాత్రమే జరుగుతుందని ఆ లోపు రైతులు పూర్తి చెరకును ఫ్యాక్టరీకి తీసుకురావాలని అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ వై.కోటయ్య తెలిపారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 27 : పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి విజయవంతం చేయాలన్నారు.

నేత్రదానం

పెనుబల్లి, ఫిబ్రవరి 27 : మండల పరిధిలోని బయన్నగూడెం గ్రామానికి చెందిన దొంతు కృష్ణయ్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. వారి కుటుంబసభ్యులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ సప్తగిరి వీఎం బంజర వారు నేత్రదానంపై అవగాహన కల్పించి మృతుడి నేత్రాలను సేకరించి ఖమ్మం నేత్ర నిధికి పంపించారు. కార్యక్రమంలో ఫస్ట్ ప్రెసిడెంట్ నాళ్ల జయరాం, టెక్నిషియన్ నాగేశ్వరరావు, గ్రామపెద్దలు ఆళ్ల సూరి, బయన్నగూడెం వైస్ ప్రెసిడెంట్ దొంతు మాధవరావు, లక్ష్మణరావు, సత్యం, దుర్గారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27 : మండలంలోని పిండిప్రోలులో గుండెపోటుతో ఇటీవల మృతిచెందిన మీగడ మల్లయ్య కుటుంబానికి తన స్నేహితులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. తనతో చదువుకున్న స్నేహితులంతా రూ.11,500 నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో దొండేటి సురేశ్, బూర్లె లక్ష్మీనారాయణ, దొండేటి కిషోర్, కొంపెల్లి నాగేశ్వరావు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఎన్‌హెచ్ఎం విభాగంలో పలు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వరికూటి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు సహా వివిధ కేటరిగీల పోస్టులకు అర్హతల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఖాళీల పూర్తి వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్ http://khammama.telangana.gov.inలో ఉంటాయని వెల్లడించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న సెలెక్షన్ కమిటీ.. ఆర్‌వోఆర్ అనుసరించి ఈ నియామకాలను చేపడుతుందని అన్నారు. దరఖాస్తులను ఈ నెల 29 నుంచి మార్చి 3 సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలు ఉంటాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

నంబర్ ప్లేట్లు లేని 44 వాహనాలు సీజ్

- జరిమానా చెల్లించిన వాహనదారులు మళ్లీ పొరపాట్లు చేయొద్దు
- మరోసారి అలా చేస్తే కేసులు నమోదు చేస్తాం: ట్రాఫిక్ ఏసీపీ

ద్విచక్రవాహనాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 27: నంబర్ ప్లేట్లు లేకుండా నగరంలో తిరుగుతున్న 44 వాహనాలను సీజ్ చేసిన్నట్లు ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. నిబంధనల అతిక్రమించి రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నంబరు ప్లేట్లు, రిజిస్ట్రేషన్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను నగరంలోని పలు కూడళ్లలో మంగళవారం తనిఖీ చేసి వాటిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. నంబరు ప్లేట్ ట్యాంపరింగ్ చేసిన స్పోర్ట్స్ బైక్‌పై కేసు నమోదు చేసేందుకు ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు చెప్పారు. అలాగే, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారు.. చలానాల నుంచి తప్పించుకునేందుకు, ట్రాఫిక్ పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు అనేక పొరపాట్లు చేస్తున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్ నంబర్‌లోని టీఎస్, ఏపీ అక్షరాలతోపాటు చివరి రెండు నంబర్లు కనిపించకుండా స్టిక్కర్లు, ప్లాస్టర్లు, మాస్కులను నంబర్ ప్లేట్లకు అతికిస్తున్నారని వివరించారు. కొన్ని వాహనాలకు ముందు నంబర్ ప్లేట్ సరిగానే ఉన్నప్పటికీ వెనుక నంబర్ కన్పించకుండా ప్లేట్‌ను బెండ్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. తప్పుడు నంబర్ ప్లేట్లతో కొందరు యువకులు రోడ్లపై ఇష్టమొచ్చినటుగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని అన్నారు. అలాగే, నంబర్ లేని బైకులపై చైన్ స్నాచర్లు నేరాలు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై, అలాగే వికృతమైన నంబర్ ప్లేట్లను కలిగిన వాహనాలపై మోటారు వాహనాల చట్టం 420/511 ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలోనే 203 వాహనాలకు జరిమానా విధించినట్లు చెప్పారు. ఆయా వాహనదారులు ఈ పొరపాట్లను మళ్లీ చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ నేరగాళ్ల వల్ల మోసపోతే 1930 నంబర్‌కు కాల్ చేయండి
- జిల్లాలో రెండు నెలల్లో రూ.1.4 కోట్ల వరకూ 'ఆన్‌లైన్' మోసాలు
- నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా రూ.25 లక్షలను ఫ్రీజ్ చేశాం: సీపీ

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 27: ఆన్‌లైన్ మోసాల కేసులు ఇటీవల ఎక్కువగా నమోదవుతున్నందున ప్రజలు వాటి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సీపీ సునీల్‌దత్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాలపై ఈ ఏడాది ఇప్పటికే జిల్లాలో 292 ఫిర్యాదు వచ్చాయని, వీటిల్లో రూ.1.4 కోట్ల వరకూ బాధితులు మోసపోయారని అన్నారు. వీటిలో నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా రూ.25 లక్షల వరకు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. మరో రూ.6 లక్షలను బాధితుల ఖాతాల్లోకి తిరిగి జమ చేసినట్లు చెప్పారు. అవగాహన లేమి కారణంగా నేరగాళ్ల మాటలను నమ్మవద్దని సూచించారు. ఒక వేళ మోసపోతే మాత్రం వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్ సీఎస్‌బీ) ఆధ్వర్యంలో ఈ కాల్ సెంటర్ 24/7 పని చేస్తుందని తెలిపారు. కాల్ సెంటర్ నుంచి సమాచారం వెళ్లగానే ఆయా బ్యాంకుల రిస్క్ మేనేజ్‌మెంట్ అధికారులు అప్రమత్తమవుతారని, బ్యాంకు ఖాతాల ఆధారంగా ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని గుర్తించి ఆయా ఖాతాలను ఫ్రీజ్ చేస్తారని వివరించారు.

'విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేయాలి'

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 27: సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులో మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు వసతి గృహ సంక్షేమాధికారులు చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకుడు కస్తాల సత్యనారాయణ సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్లకు ఖమ్మం టీటీడీసీలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో యుక్త వయసులో వచ్చే సమస్యలు గుర్తించాలని కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సదానందం మాట్లాడుతూ.. పిల్లలో భావోద్వేగాల నియంత్రణ కోసం మానసిక వైద్య నిపుణులతో కౌన్సిలింగ్ చేయించాలని అన్నారు. మానవ వనరుల కేంద్రం మేనేజర్ ఆనంద్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల సహాయ సంక్షేమాధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

'ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27: ప్రతి విద్యార్థీ ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాల చైర్‌పర్సన్ నిషితశర్మ ఆకాంక్షించారు. నగరంలోని ఆ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు 10వ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలను అనుసరించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఏఆర్ ఏసీపీ నర్సయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కూసుమంచి(నేలకొండపల్లి)/కూసుమంచి/తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27: నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్స్ తెలిపారు. బుధవారం నుంచి వచ్చే నెల 16 వరకు జరిగే పరీక్షలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి: మంత్రి తుమ్మల

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27: చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన వికాస్ పాఠశాల 10వ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లలు ఆసక్తి చూపించే రంగంలో ప్రోత్సహిస్తే వారు ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లావణ్య, కాంతారావు, మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తమ్మిలేరు బ్రిడ్జి

- గుంతలతో నిత్యం ప్రమాదాలు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 27 : సత్తుపల్లి పట్టణం వెలుపల ఉన్న తమ్మిలేరు వంతెనపై వాహనాలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో వాహనచోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వివరాల్లోకెళ్తే.. సత్తుపల్లి పట్టణం మీదుగా సూర్యాపేట- దేవరపల్లి జాతీయ రహదారి వెళ్తున్నది. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు వెళ్లే ఈ రోడ్డు మీద తమ్మిలేరు వద్ద పెద్ద వంతెన నిర్మించారు. ఈ వంతెనపై ఇటీవల గోతులు ఏర్పడ్డాయి. దగ్గరకు వచ్చేవరకు గోతులు కనిపించకపోవడంతో వాహనదారులు సడన్‌బ్రేక్ వేస్తున్నారు.. దీంతో వెనుకవచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. ఒక్కసారిగా గోతిలో పడడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మరమ్మతుల విషయంపై స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా సూర్యాపేట-దేవరపల్లి రహదారి మా పరిధిలోకి రాదని, నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి వస్తుందని చెప్పారు. హైవే అథారిటీ డీఈ సూరిబాబును వివరణ కోరగా తమ్మిలేరు పెద్ద వంతెన తమ పరిధిలోకి రాదని, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోకి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

అలుగు బావిని వినియోగంలోకి తేవాలి: మేయర్

బావిని పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం, ఫిబ్రవరి 27: రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని నీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. నీటి ఎద్దడి నివారణ చర్యల కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి నగరంలో మంగళవారం ఆమె పర్యటించారు. కేఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి వినియోగాన్ని తీర్చే బావులను, బోర్లను పరిశీలించారు. 41వ డివిజన్ లకారం చెరువు అలుగుల వద్ద ఉన్న 150 ఏళ్ల అలుగుబావిని పరిశీలించారు. మరమ్మతులు, రక్షణ చర్యలు చేపట్టి ఈ బావిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. దీని ద్వారా పరిసర ప్రాంత ప్రజల దాహార్తిన తీర్చవచ్చునని అన్నారు. కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ఏఈ జ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, బోర్స్ రిపేర్ ఇన్‌చార్జి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సంద్ర పూజలు

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సంద్ర

కల్లూరు, ఫిబ్రవరి 27 : మండల పరిధిలోని హనుమాతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జక్కుల రాములు ఇంట్లో జరిగిన పూజా కార్యక్రమంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాలెపు రామారావు, లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణరావు, పొట్టి కృష్ణ, సీహెచ్ కిరణ్‌కుమార్, రాందాసు పాల్గొన్నారు.

నేటి నుంచి కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని కరుణగిరి పుణ్యక్షేత్రంలో ఈ నెల 28 నుంచి మూడు రోజులపాటు కనుల పండువగా కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నాయుడుపేట చర్చ్ డీన్ రెవ రెండం మాత్యు వరప్రసాదరాజు తెలిపారు. తొలి రోజు సాయంత్రం 4గంటలకు పతాక ఆవిష్కరణ అనంతరం రెవరెండం పసుపులేటి యుగల్‌కుమార్ ప్రసంగిస్తారన్నారు. మూడు రోజులు ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటూ, తూటికుంట్లకు చెందిన క్రీస్తు దళం వారిచే బుర్ర కథ ఉంటుందన్నారు. మార్చి-1వ తేదీన స్వస్థత ప్రార్థనలు ఉంటాయన్నారు. రెండు తెలుగురాష్ట్రాల నుంచి సుమారుగా 3లక్షల మంది వరకు విశ్వాసులు హాజరుఅయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు.

నాగేందర్ పోరాట స్ఫూర్తి అభినందనీయం: జనార్దన్

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27: ఉద్యోగుల హక్కుల కోసం నాగేందర్ చేసిన పోరాట స్ఫూర్తి అభినందనీయమైదని తెలంగాణ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ కనకం జనార్దన్ అన్నారు. నిరంతరం చేసిన పోరాటం ఫలితంగానే ఆయనకు జాతీయ కార్యదర్శిగా పనిచేసే అవకాశం లభించిందని అన్నారు. ఖమ్మం డీసీసీబీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేందర్.. కొన్నేళ్లుగా వివిధ హోదాల్లో అసోసియేషన్ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం హైదరబాద్‌లో జరిగిన అసోసియేషన్ జాతీయ సదస్సులో కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఖమ్మం డీసీసీబీలో జరిగిన కార్యక్రమంలో సంఘం బాధ్యులు ఆయనను సన్మానించారు.

'ఇంటిపన్నుల భారం తగ్గించాలి'

వైరాటౌన్, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలోనే వైరా మున్సిపాలిటీలో ఇంటిపన్నుల భారం ఎక్కువ ఉందని, ప్రజలపై భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో రూ.98 లక్షల నుంచి రూ.3 కోట్లు పన్నుల వసూలు టార్గెట్ నిర్ణయం ఎలా చేశారని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా పన్నులు వేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం వైరా పట్టణ కమిటీ సభ్యుడు పైడిపల్లి సాంబశివరావు ఉన్నారు.

రుణాల రికవరీ బాధ్యత బ్యాంకు మేనేజర్లదే.. డీసీసీబీ అధికారుల సమావేశంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27: డీసీసీబీలోని ఆయా బ్రాంచీల ద్వారా మంజూరు చేసే రుణాలను రికవరీ చేసే బాధ్యత సదరు బ్రాంచీల మేనేజర్లదేనని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. బ్యాంకు సీఈవో అబ్దుల్ ఉర్ రెహమాన్, బ్యాంకు అధికారులతో కలిసి ఖమ్మం డీసీసీబీలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించినట్లు చెప్పారు. అదే సమయంలో రుణాల వసూళ్లలో సన్న, చిన్నకారు రైతుల ఇబ్బందులు గురి చేయవద్దని సూచించారు. సంఘాల పరిస్థితి, బ్యాంకు మనుగడ వంటి విషయాలను వివరించి రుణాల వసూళ్లను చేయాలని ఆదేశించారు. ఎన్‌పీఏలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కలెక్టర్ చొరవతో ఎస్సీ వసతి గృహాలకు కంప్యూటర్లు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 27: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో కార్యాలయ కార్యకలాపాలు, విద్యార్థుల అవసరాల కోసం కలెక్టర్ చొరవతో ప్రభుత్వం కంప్యూటర్లను అందించిందని ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ అన్నారు. నగరంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు బాలుర వసతి గృహానికి మంజూరైన కంప్యూటర్‌ను మంగళవారం ఆన్‌చేసి ప్రారంభించి మాట్లాడారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అజయ్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ రవీందర్, హెచ్‌డబ్ల్యూవోలు రుక్మారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
HOUSE FOR SALE
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ
ఇద్దరు యువకుల దుర్మరణం
ఖమ్మం జిల్లాలో ఘటన

బోడ రమేష్ (ఫైల్), షేక్ ముజాకీర్ (ఫైల్)

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27: ఎదురెదురుగా రెండు బైక్స్ ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన సోమవారం రాత్రి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలకేంద్రంలో జరిగింది. తిరుమలాయపాలెం ఎస్సై గిరిధర్‌రెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం పంచాయతీ పరిధిలోని బోడ తండాకు చెందిన బోడ రమేష్ (34) ఖమ్మం నగర శివారులోని ఓ గ్రానైట్ క్వారీలో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకున్న రమేష్ బైక్‌పై స్వగ్రామానికి పయనమయ్యాడు. మార్గమధ్యంలోని తిరుమలాయపాలెం వద్ద బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఘటనలో రమేష్‌తో పాటు మరో బైక్‌పై వస్తున్న షేక్ ముజాకీర్ (19) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే ఇదే బైక్‌పై వస్తున్న ముజాకీర్ స్నేహితులు సాయితనీష్, మహ్మద్ పాషా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఖమ్మంలోని ప్రధానాసుపత్రికి తరలించారు. మృతుడు రమేశ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేశ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడినట్లయింది. మరో మృతుడు ముజాకీర్ స్వస్థలం ఖమ్మం నగరం. ముజాకీర్ డిగ్రీ చదువుతున్నాడు. చేతికొచ